మీడియాతో మాట్లాడుతున్న దానకిశోర్

ప్రజా పాలనకు ఏర్పాట్లు చేయండి

- ప్రజాప్రతినిధులను భాగస్వామ్యం చేయాలి
- మున్సిపల్ కమిషనర్లకు పురపాలక శాఖ కార్యదర్శి దానకిశోర్ ఆదేశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'ప్రజాపాలన'లో భాగంగా ఈ నెల 28 నుంచి ప్రారంభం కానున్న వార్డు సభలకు ఏర్పాట్లు పూర్తి చేయాలని పురపాలక శాఖ ముఖ్యకార్యదర్శి దానకిశోర్ అధికారులను ఆదేశించారు. పురపాలక శాఖ సంచాలకులు హరిచందన, మున్సిపల్ కమిషనర్లతో సోమవారం ఆయన సమావేశమై 'ప్రజాపాలన' సన్నద్ధతపై సమీక్షించారు. దరఖాస్తుల స్వీకరణ, వాటికి రసీదు ఇవ్వడం, కంప్యూటరీకరణ చేయడం, తదితర అవసరమైన పనుల కోసం బృందాలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. వార్డు సభల తేదీలను పెద్ద ఎత్తున ప్రచారం చేయాలని చెప్పారు. ప్రజా ప్రతినిధులను భాగస్వామ్యం చేసుకొని ముందుకెళ్లాలన్నారు. కార్యక్రమంపై ఏ రోజుకు ఆరోజు నివేదికను రాష్ట్ర కార్యాలయానికి పంపించాలన్నారు. కాగా, ఈ నెల 28 నుంచి జనవరి 6వ తేదీ వరకు 'ప్రజాపాలన' కార్యక్రమం జరగనుంది. ప్రతి పట్టణం, గ్రామం, తండాలో ప్రజాపాలన నిర్వహించనున్నారు. అధికారులు ప్రతి రోజు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఒక గ్రామంలో, మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 6 గంటల వరకు మరో గ్రామంలో సభలు నిర్వహిస్తారు. ఆరు గ్యారంటీలకు సంబంధించిన దరఖాస్తులను ఈ గ్రామసభల్లో స్వీకరించి రసీదు ఇస్తారు. దరఖాస్తులను నింపడానికి ఇబ్బంది లేకుండా 28వ తేదీకి ఒకట్రెండు రోజుల ముందే ప్రజలకు ఫాంలను అందించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది.

ఒకే కుటుంబంలో ఐదుగురికి కరోనా

- రాష్ట్రంలో పెరుగుతున్న కోవిడ్, జేఎన్.. 1 వేరియంట్ కేసులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

జయశంకర్-భూపాలపల్లి జిల్లా గణపురం మండలం గాంధీనగర్ గ్రామంలో కోవిడ్ కలకలం సృష్టిస్తోంది. ఒకే కుటుంబంలో ఐదుగురికి కరోనా పాజిటివ్ వచ్చింది. రెండ్రోజుల కిందట అనారోగ్యంతో ఎంజీఎంలో చికిత్స పొందుతున్న ఓ వృద్ధురాలికి కోవిడ్ కొత్త వేరియంట్ పాజిటివ్ వచ్చింది. దీంతో అప్రమత్తమైన వైద్య ఆరోగ్యశాఖ బాధితురాలి ఇంట్లోని కుటుంబ సభ్యులకు కరోనా టెస్టులు చేయగా నలుగురికి లక్షణాలు ఉన్నట్టు తేలింది. ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వృద్ధురాలు వెంటిలేషన్ మీద ఉన్నట్టు తెలిసింది. ఆ కుటుంబ సభ్యుల్లో ఇద్దరు పిల్లలు, ఇద్దరు పెద్దలకు కరోనా రావడంతో ఐసోలేషన్‌లోనే ఉండాలని వైద్య సిబ్బంది సూచించారు. రాష్ట్రంలోనూ కోవిడ్,జేఎన్..1 వేరియంట్ కేసులు పెరుగుతున్నాయని వైద్యవర్గాలు ధ్రువీకరించాయి.

రేషన్ బియ్యం రీ సైక్లింగ్‌కు పాల్పడితే కఠిన చర్యలు

- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రేషన్ దుకాణాల ద్వారా ఇచ్చే చౌక బియ్యం రీసైక్లింగ్‌కు పాల్పడితే ఎంతటి వారు అయినా కఠిన చర్యలు తప్పవని పౌరసరఫరాలు, నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి హెచ్చరించారు. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌లోని ఓ రేషన్ దుకాణాన్ని ఆయన సోమవారం పరిశీలించారు. పేదలకు అందించే బియ్యానికి ప్రభుత్వం భారీగా ఖర్చు చేస్తుందన్నారు. ఈ బియ్యాన్ని కొందరు గత ప్రభుత్వంలోని నాయకులు, అధికారుల అండదండలతో రీసైక్లింగ్ చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. రేషన్ మాఫియా ఆగడాలపై కఠినమైన చర్యలు తీసుకుంటామన్నారు. "2014లో బిఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చినప్పుడు సివిల్ సప్లైస్ కార్పొరేషన్ అప్పు రూ.3,300 కోట్లు. ప్రస్తుతం వడ్డీ భారమే ఏడాదికి రూ.3,000 కోట్లు ఉంది. గత ప్రభుత్వం ఈ శాఖని నిర్లక్ష్యం చేయడంతో కార్పొరేషన్‌కు రూ.11 వేల కోట్ల నష్టం వాటిల్లింది. భారీగా బియ్యం నిల్వలు ఉంచుకోవడానికి రాష్ట్రంలో స్థలం లేదు. బియ్యం నిల్వలను కొనుగోలు చేసేందుకు కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలు ముందుకొచ్చినా.. గత ప్రభుత్వం విక్రయించకుండా గోదాముల్లోనే ఉంచి పాడవడానికి కారణమైంది. ఆ రాష్ట్రాలకు బియ్యం విక్రయాలను పరిశీలిస్తున్నాం. కార్పొరేషన్‌ను ప్రమాదకర స్థితి నుంచి రక్షించడానికి ప్రయత్నాలు చేస్తున్నాం" అని మంత్రి ఉత్తమ్ వివరించారు.

గ్రూప్-2 నిర్వహణపై సందిగ్ధం!

- జనవరి 6, 7 తేదీల్లో రాతపరీక్షలు
- ఏర్పాట్లు చేయని టిఎస్‌పిఎస్‌సి
- వాయిదాపై ఇంకా స్పష్టత ఇవ్వని వైనం
- చైర్మన్ సహా సభ్యుల రాజీనామా
- ఆందోళనలో అభ్యర్థులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వచ్చేనెల ఆరు, ఏడు తేదీల్లో గ్రూప్-2 రాతపరీక్షల నిర్వహణపై సందిగ్ధం నెలకొంది. ఇంకా కొన్ని రోజులే ఉన్నా రాతపరీక్షల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లను తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టిఎస్‌పిఎస్‌సి) చేయడం లేదు. ఇంకోవైపు గ్రూప్-2 రాతపరీక్షలు వాయిదా వేస్తున్నట్టు ఇంకా అధికారికంగా ప్రకటించలేదు. దీంతో అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారు. పరీక్ష నిర్వహిస్తారా? లేక వాయిదా వేస్తారా? అన్నది ప్రకటించాలని వారు కోరుతున్నారు. ఈనెల 11న టిఎస్‌పిఎస్‌సి సమీక్షా సమావేశం సమయంలోనే రాతపరీక్షలను రీషెడ్యూల్ చేయాలంటూ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. కానీ ఇంత వరకు గ్రూప్-2 వాయిదాకు సంబంధించి అధికారిక ప్రకటన విడుదల చేయకపోవడం గమనార్హం. రాష్ట్రంలో 18 శాఖల్లో 783 పోస్టుల భర్తీకి గతేడాది డిసెంబర్ 29న గ్రూప్-2 నోటిఫికేషన్‌ను విడుదల చేసిన విషయం తెలిసిందే. రాష్ట్ర వ్యాప్తంగా 5,51,943 మంది అభ్యర్థులు దరఖాస్తు చేశారు. తొలుత ఆగస్టు 29,30 తేదీల్లో రాతపరీక్షలను నిర్వహించాలని టిఎస్‌పిఎస్‌సి నిర్ణయించింది. అభ్యర్థుల విజ్ఞప్తి మేరకు వాయిదా వేసింది. నవంబర్ రెండు, మూడు తేదీల్లో నిర్వహించనున్నట్టు ప్రకటించింది. అయితే ఎన్నికల కోడ్ అమల్లోకి రావడం వల్ల మరోసారి గ్రూప్-2 రాతపరీక్షలు వాయిదా పడ్డాయి. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడంతో ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డి బాధ్యతలను స్వీకరించారు. గతంలో ప్రశ్నాపత్రాల లీకేజీ, రాతపరీక్షలు వాయిదా పడడం వంటి ఘటనలతో టిఎస్‌పిఎస్‌సి అభాసుపాలైన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో టిఎస్‌పిఎస్‌సి చైర్మన్ పదవికి బి. జనార్ధన్‌రెడ్డి రాజీనామా చేశారు. అదే బాటలో సభ్యులు కూడా రాజీనామాలను సమర్పించారు. అయితే జనార్ధన్‌రెడ్డి రాజీనామాను గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ ఆమోదించకపోవడం గమనార్హం. ప్రస్తుతం టిఎస్‌పిఎస్‌సికి పాలకమండలి లేదు. రాష్ట్ర ప్రభుత్వం కొత్త పాలకమండలి నియామకంపై కసరత్తు ప్రారంభించినట్టు తెలిసింది. నిరుద్యోగుల ఆకాంక్షలను నెరవేర్చడం, పారదర్శకంగా ఉద్యోగాలను భర్తీ చేయడం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తున్నది. జాబ్ క్యాలెండర్‌ను ప్రకటిస్తామని కాంగ్రెస్ అసెంబ్లీ ఎన్నికల్లో హామీ ఇచ్చింది. అందుకే టిఎస్‌పిఎస్‌సి చైర్మన్, సభ్యుల నియామకానికి సంబంధించి నిరుద్యోగుల నుంచి వ్యతిరేకత రాకుండా జాగ్రత్తగా వ్యవహరించాలని భావిస్తోంది. ఆచి తూచి అడుగులు వేస్తున్నది. ఈ క్రమంలో టిఎస్‌పిఎస్‌సికి కొత్త పాలకమండలి వచ్చిన తర్వాతే రాత ^పరీక్షలను నిర్వహించే అవకాశమున్నది. త్వరలోనే గ్రూప్-1, గ్రూప్-2, గ్రూప్-3 రాతపరీక్షలకు సంబంధం చి రీ-షెడ్యూల్ చేసి కొత్త తేదీలను ప్రకటించనుంది.

సింగరేణి ప్రయివేటుపరం కానివ్వం

- ఇంటి స్థలం, వడ్డీ లేని రుణం ఇస్తాం
- రెవెన్యూ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

సింగరేణి కార్మికుల సమస్యలు పరిష్కరిస్తానని, 200 గజాల ఇంటి స్థలం, రూ.20లక్షల వడ్డీలేని రుణం ఇస్తామని రెవెన్యూ,హౌసింగ్, సమాచార పౌరసంబంధా ల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. సోమవారం ఇల్లందు, టేకులపల్లి, కొత్తగూడెం, మణుగూ రు సింగరేణి ఏరియాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించా రు. మణుగూరు పీకే ఓసీ వద్ద మీటింగ్‌లో మంత్రి మాట్లాడుతూ..సింగరేణి ఎన్నికల్లో బ్యాలెట్ పేపర్ నంబర్ గుర్తు గడియారంపై ఓటు వేసి ఐఎన్‌టీ యూసీని గెలిపించాలని కోరారు. గత ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయలేదన్నారు. మళ్లీ కార్మికులను మోసం చేసేందుకు కొత్త హామీలు ఇస్తున్నారన్నారు. సింగరేణిలో పది సంవత్సరాలు ఎన్నికలు నిర్వహించ కుండా నిరంకుశంగా పాలించారన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో సింగరేణి కార్మికుల సమస్యలు పరిష్కరి స్తామన్నారు. టిబిజికెఎస్ హామీలు నమ్మొద్దన్నారు.

వడ్డించే వాడు మనవాడైతే అన్ని సౌకర్యాలు సమకూర్తాయన్నారు. కారుణ్య నియమాకాల్లో జరిగిన అవినీతిని బయటపెడతామన్నారు. ఐఎన్‌టియుసిని గెలిపిస్తే..ఖర్చు లేకుండా కారుణ్య నియామకాలు ఇస్తామన్నారు. సింగరేణి అన్ని ఏరియాలలో సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి నిర్మిస్తామన్నారు. ప్రయివేటు ప్రస్తావన లేకుండా ప్రభుత్వ రంగంలోనే సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో కొత్త గనులను ప్రారంభిస్తామన్నారు. తిరిగి రెండు లక్షల ఉద్యోగాలు తీసుకొస్తామన్నారు. సింగరేణికి పూర్వ వైభవాన్ని తీసుకొస్తామని చెప్పారు. సింగరేణి దినోత్సవం రోజున సెలవుగా ప్రకటిస్తామని, మహిళా కార్మికులు గని లోపల కాకుండా ఉపరితలంలో పని చేసే అవకాశం కల్పిస్తామన్నారు. ఇతర సంఘాలకు ఓటు వేస్తే బూడిదలో పోసిన పన్నీరు అవుతుందన్నారు. అధికార పార్టీకి చెందిన కార్మిక సంఘం ఐఎన్‌టియుసిని గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక శాసన సభ్యులు వెంకటేశ్వర్లు, డిసిసిబి డైరెక్టర్ తుళ్లూరు బ్రహ్మయ్య, నాయకులు డాక్టర్ శంకర్ నాయక్, ఏరియా ఉపాధ్యక్షులు వెలగపల్లి జాన్ తదితరులు పాల్గొన్నారు.

'పార్లమెంటు' పై గులాబీ నజర్

- ఎంపి అభ్యర్థులతో కెటిఆర్ వరుస భేటీలు
- ఎంపి టికెట్ కోసం ఎమ్మెల్యేలుగా ఓడిపోయిన నేతల విశ్వప్రయత్నాలు
- మహబూబ్‌నగర్ నుంచి శ్రీనివాసగౌడ్, పెద్దపల్లి నుంచి బాల్క సుమన్
- భువనగిరి నుంచి మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్య పేరు తెరపైకి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

శాసనసభ ఎన్నికల ఓటమి నుంచి ఇప్పుడిప్పుడే తేరుకుంటున్న ప్రధాన ప్రతిపక్షం బిఆర్‌ఎస్.. రాబోయే పార్లమెంటు ఎలక్షన్లపై దృష్టి సారించింది. అందులో భాగంగా సిట్టింగ్ ఎంపిలతో ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ వరుస భేటీలు నిర్వహిస్తున్నారు. ఆది, సోమవారాల్లో హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆయన పార్లమెంటు సభ్యులతో భేటీ అయ్యారు. అసెంబ్లీ ఎన్నికల ఓటమి నుంచి బయటపడి...లోక్‌సభ ఎన్నికలకు పూర్తి స్థాయిలో సన్నద్ధమవ్వాలని ఆయన వారికి సూచించారు. ఆ మేరకు క్షేత్రస్థాయిలోని క్యాడర్‌ను సిద్ధం చేయాలని ఆదేశించారు. శాసనసభ ఎన్నికల్లో ఒక్కో పార్లమెంటు స్థానం పరిధిలో బిఆర్‌ఎస్‌కు వచ్చిన ఓట్ల వివరాలను కెటిఆర్ అడిగి తెలుసుకున్నారు. గత ఎంపి ఎన్నికల్లో ఆయా స్థానాల్లో వచ్చిన ఓట్ల శాతాన్ని పరిశీలించారు. అప్పటికీ, ఇప్పటికీ ఉన్న వ్యత్యాసంపై లెక్కలు తీశారు. ఎంపిలతో కలిసి వాటిపై సమీక్షలు నిర్వహించారు.

గత లోక్‌సభ ఎన్నికల్లో రాష్ట్రంలో బిఆర్‌ఎస్ తొమ్మిది స్థానాలను గెలుచుకుంది. అంతకుముందు (2018) నిర్వహించిన అసెంబ్లీ ఎన్నికల్లో బిఆర్‌ఎస్ అధికారాన్ని చేజిక్కించుకున్న సంగతి విధితమే. అయితే ఎంపి ఎలక్షన్లకు వచ్చేసరికి మొత్తం 17 స్థానాల్లో బిజెపి నాలుగు (సికింద్రాబాద్, ఆదిలాబాద్, నిజామాబాద్, కరీంనగర్), కాంగ్రెస్ (నల్లగొండ, భువనగిరి, మల్కాజ్‌గిరి) మూడింటిని గెలుచుకున్నాయి. కారు పార్టీకి 10 స్థానాలే దక్కాయి. ఈ నేపథ్యంలో వచ్చే ఎన్నికల్లో హైదరాబాద్ మినహా మిగతా అన్ని స్థానాల్లోనూ గెలిచేందుకు సర్వశక్తులూ ఒడ్డాలని గులాబీ పార్టీ భావిస్తోంది. శాసనసభ ఎన్నికల అనుభవం దృష్ట్యా ప్రస్తుతమున్న కొంతమంది సిట్టింగ్ ఎంపిలను మార్చి కొత్తవారికి అవకాశమివ్వాలని బిఆర్‌ఎస్ అధినేత కెసిఆర్ భావిస్తున్నారు. మెదక్ నుంచి ఆయనే బరిలోకి దిగనున్నారు. నిజామాబాద్ నుంచి ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత మరోసారి పోటీ చేయనున్నారు. కరీంనగర్ నుంచి మాజీ ఎంపి బోయినపల్లి వినోద్‌కుమార్‌కే మరో ఛాన్స్ దక్కనుందని తెలిసింది. ఇక మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, పెద్దపల్లి, మహబూబాబాద్, జహీరాబాద్, చేవెళ్ల, ఖమ్మం, వరంగల్ స్థానాల్లో బిఆర్‌ఎస్‌కు సిట్టింగ్ ఎంపీలున్నారు. వీటిలో దాదాపు పాత వారికే టికెట్లు కేటాయించాలని కెసిఆర్ భావిస్తున్నారు. కానీ ఎమ్మెల్యేగా ఓడిపోయిన మాజీ మంత్రి శ్రీనివాసగౌడ్ మహబూబ్‌నగర్ టికెట్టు కోసం, పెద్దపల్లి టికెట్టు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ విశ్వ ప్రయత్నాలు చేస్తున్నట్టు వినికిడి. భువనగిరి నుంచి గతంలో బూర నర్సయ్య గౌడ్ బిఆర్‌ఎస్ తరపున ఎంపిగా ఎన్నికయ్యారు. పలు సామాజిక సమీకరణాలే ఇందుకు కారణం. ఆ రీత్యా ఇప్పుడు ఆ టికెట్టును దక్కించుకునేందుకు మాజీ ఎమ్మెల్యే బూడిద భిక్షమయ్య గౌడ్ తన వంతు ప్రయత్నాలు చేస్తున్నట్టు సమాచారం.

ఆ రెండింటిలో బలమైన అభ్యర్థులు

గత ఎన్నికల్లో మల్కాజ్‌గిరి నుంచి ఇప్పటి సిఎం రేవంత్ రెడ్డి, సికింద్రాబాద్ నుంచి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి గెలుపొందారు. ఇప్పుడు ఈ రెండు స్థానాలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న బిఆర్‌ఎస్ వాటిపై ప్రత్యేక దృష్టి సారించింది. ఆయా నియోజకవర్గాల్లో 'అన్ని రకాలుగా' బలమైన అభ్యర్థులను రంగంలోకి దించాలని కెసిఆర్ భావిస్తున్నారు.

చేవెళ్లలో మరోసారి గులాబీ జెండా ఎగరాలి

చేవెళ్ల పార్లమెంటు స్థానంలో మరోసారి గులాబీ జెండా ఎగరాలని బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ ఆకాంక్షించారు. గెలుపే లక్ష్యంగా పని చేయాలని నాయకులు, కార్యకర్తలకు ఆయన దిశా నిర్దేశం చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గ ఎన్నికల సమావేశాన్ని నిర్వహించారు. గ్రామ స్థాయి నుంచి నియోజకవర్గ స్థాయి వరకూ పూర్తి సమన్వయంతో పని చేయాలని ఈ సందర్భంగా కెటిఆర్ సూచించారు. భేటీలో మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, పట్నం మహేందర్‌రెడ్డి, ఎంపి రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యేలు ప్రకాశ్ గౌడ్, అరికెపూడి గాంధీ, మాజీ ఎమ్మెల్యేలు కొప్పుల మహేశ్‌రెడ్డి, మెతుకు ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

నాకు లైన్ క్లియర్ : ఎంపి రంజిత్‌రెడ్డి

సమావేశానంతరం ఎంపి రంజిత్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ... తనను మరోసారి చేవెళ్ల నుంచి పోటీ చేయాలంటూ కెటిఆర్ సూచించారని అన్నారు. గెలుపే లక్ష్యంగా పని చేయలంటూ ఆయన ఆదేశించారని తెలిపారు. బీఆర్‌ఎస్ ఖాళీ అవుతుందంటూ కాంగ్రెస్, బిజెపి అసత్య ప్రచారాలు చేస్తున్నాయంటూ విమర్శించారు. అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్టీ ఓడిపోయిన స్థానాలపై దృష్టి సారించటం ద్వారా ఎంపి సీట్లలో గెలుపుకోసం ప్రణాళికలు సిద్ధం చేస్తామని వివరించారు.

నేడు ఢిల్లీకి సిఎం, డిప్యూటి సిఎం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మంగళవారం ఢిల్లీకి వెళ్లనున్నారు. ప్రధాని మోడీని కలిసి విభజన హామీలు, రాష్ట్రానికి రావాల్సిన బకాయిలు, ఇతర అంశాలపై చర్చించే అవకాశం ఉన్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. సిఎంగా ప్రమాణస్వీకారం చేసిన తరువాత రేవంత్ రెడ్డి ప్రధాని మోడీతో భేటీ కానుండటం ఇదే తొలిసారి. మరోవైపు, ఎన్నికల్లో కష్టపడి పని చేసిన వారితోపాటు టికెట్లు త్యాగం చేసిన కాంగ్రెస్ నాయకులు నామినేటెడ్ పోస్టుల కోసం వేచి చూస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం ఢిల్లీ వెళ్లనున్న సిఎం, డిప్యూటీ సిఎం.. కాంగ్రెస్ పెద్దలతో సమావేశమై రాష్ట్రంలోని తాజా పరిస్థితులపై చర్చించనున్నారు. అధికారం చేపట్టిన తరువాత ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను వివరించనున్నారు. ఎమ్మెల్సీ పదవులు, లోక్‌సభ ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపిక తదితర అంశాలపై కీలకంగా చర్చించే అవకాశం ఉంది.

బుక్ మై షోపై కేసు

- కొత్త సంవత్సర వేడుకలకు అనుమతులు తప్పనిసరి
- అడిషనల్ డిసిపి నంద్యాల నరసింహారెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కొత్త సంవత్సరం వేడుకలకు నిర్వాహకులు తప్పనిసరిగా అనుమతి ఉండాలి.. నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన కఠిన చర్యలు తప్పవని మాదాపూర్ అడిషనల్ డిసిపి నంద్యాల నర్సింహారెడ్డి అన్నారు. సోమవారం హైదరాబాద్ మాదాపూర్ డిసిపి కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మాదాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని 'సన్ బర్గ్' అనే సంస్థ ఎలాంటి అనుమతులూ లేకుండా బుక్ మై షో ద్వారా కొత్త సంవత్సరం కార్యక్రమానికి టికెట్లను విక్రయిస్తున్నట్టు గుర్తించామని తెలిపారు. సదరు సంస్థపై కేసు నమోదు చేసి నోటీసులు ఇచ్చామని చెప్పారు. ఇలాంటి చర్యలకు ఎవరు పాల్పడినా చర్యలు ఉంటాయని హెచ్చరించా రు. పోలీస్ అనుమతి లేకుండా ఎలాంటి కార్యక్రమాలూ చేపట్టొద్దని వివిధ సంస్థలకు, నిర్వాహకులకు సూచించారు. ఈ సమావేశంలో మాదాపూర్ ఎసిపి శ్రీనివాస్, మాదాపూర్ సిఐ తిరుపతి తదితరులు ఉన్నారు.

కొకైన్ కంటే అల్ప్రాజోలం ప్రమాదకరం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మాదకద్రవ్యాల్లోని కొకైన్ కంటే అల్ప్రాజోలం ప్రమాదకరమని టిఎస్‌న్యాబ్ డైరెక్టర్ సందీప్ శాండిల్య హెచ్చరించారు. తెలంగాణలో అల్ప్రాజోలం తలనొప్పిగా మారిందని.. దీనిని అక్రమంగా విక్రయిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇటీవల రూ.3.14 కోట్లు విలువ చేసే 31.42 కిలోల అల్ప్రాజోలంను నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లిలో పట్టుకున్నారు. ఈ సమాచారం ఆధారంగా టీఎస్‌న్యాబ్ పోలీసులు.. రెండు రోజుల కింద సంగారెడ్డి జిన్నారంలో మూతపడిన ఓ పరిశ్రమలో 14 కిలోల నార్డజెపమ్ డ్రగ్ పట్టుబడిందని తెలిపారు. ఈ కేసులో నలుగురిని అరెస్టు చేసినట్లు వివరించారు. మరో కేసులో సూరారం పరిధిలో నరేందర్ అనే వ్యక్తి నుంచి 10 కిలోల అల్ప్రాజోలం స్వాధీనం చేసుకున్నామన్నారు. మరో కేసులో విధుల నుంచి తొలగించిన ఏఆర్ కానిస్టేబుల్ కూడా ఈ దందాలో ఉన్నట్లు గుర్తించామన్నారు. ఢిల్లీ నుంచి వచ్చిన పార్సిళ్లలో సైతం 34 కిలోలు పలువురి చేతులు మారినట్లు గుర్తించామన్నారు. ఇలా అల్ప్రాజోలం విక్రయిస్తున్న నిందితుల్లో మాజీ పోలీసులు సహా కామారెడ్డికి చెందిన ఎక్సైజ్ కానిస్టేబుల్ కూడా ఉనట్లు గుర్తించామన్నారు. హైదరాబాద్‌లో అల్ప్రాజోలంకు సంబంధించి ఇప్పటివరకూ 66 కేసులు నమోదు చేసినట్లు సందీప్ శాండిల్య వివరించారు.

సమన్వయంతో పనిచేయాలి

- ప్రభుత్వ కార్యక్రమాల్ని క్షేత్రస్థాయికి తీసుకెళ్లాలి
- సజావుగా గ్రామసభలు జరపాలి
- వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి దామోదర రాజనర్సింహ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రభుత్వ పథకాలను అర్హులైన ప్రజలకు అందించే దిశగా అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేయాలని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ అన్నారు. సంగారెడ్డి జిల్లా కలెక్టరేట్ ఆడిటోరియంలో సోమవారం ప్రజాపాలన కార్యక్రమం.. జిల్లాస్థాయి సమన్వయ సమావేశాన్ని మంత్రి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ కార్యక్రమాలను క్షేత్ర స్థాయికి తీసుకెళ్లే బాధ్యత అధికారులదేనన్నారు. ప్రభుత్వం చేసిన వాగ్దానాలు, వాటి ఆచరణ, అమలు చేసే పాత్రలో అధికారులే కీలకమన్నారు. చట్టానికి లోబడి రెవెన్యూ, పోలీస్ శాఖలు ఆరు గ్యారంటీలను ప్రజలకు అందేలా చూడాలన్నారు. గత ప్రభుత్వంలో జరిగిన తప్పిదాలను తాను ప్రస్తుతం వెలికి తీసే ఆలోచన లేదన్నారు. అలాంటి తప్పిదాలను తమ ప్రభుత్వం చేయబోదని స్పష్టం చేశారు. ప్రభుత్వానికి, పరిపాలనకు అధికారగణం గుండెలాంటిదన్నారు. ప్రజలకు జవాబుదారీగా సేవలందించే ప్రభుత్వ పరిపాలనకు అనుగుణంగా అధికారుల పనితీరు ఉండాలన్నారు. ఈ నెల 28 నుంచి జనవరి ఆరు వరకు నిర్వహించనున్న ప్రజాపాలన కార్యక్రమంలో అధికారులు ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించాలన్నారు. గ్రామసభలు సజావుగా జరిగేలా అందరూ బాధ్యత వహించాలన్నారు. గ్రామ సభల్లో దివ్యాంగులు, మహిళలకు ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. నియోజకవర్గం, మండల, గ్రామ స్థాయిలో ప్రత్యేక అధికారుల బృందాలుగా ఏర్పాటు చేసి మహాలక్ష్మి, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్లు, చేయూత, రైతు భరోసా పథకాల కోసం దరఖాస్తులు స్వీకరించాలన్నారు. ప్రతి రోజూ ఉయదం ఎనిమిది గంటల నుంచి 12 గంటల వరకు, మధ్యాహ్నం రెండు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు దరఖాస్తుల్ని స్వీకరించాలని చెప్పారు. గ్రామపంచాయతీ స్థాయిలో ప్రత్యేక అధికారిని ఏర్పాటు చేయాలన్నారు. అతనే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. అర్హులైన లబ్దిదారులకు దశలవారీగా సామాజిక భద్రత, సంక్షేమ పథకాలు.. ఆరు గ్యారంటీలు అందించడం కోసం ఈ కార్యక్రమాన్ని అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టామన్నారు. నారాయణఖేడ్ ఎమ్మెల్యే డాక్టర్ సంజీవరెడ్డి మాట్లాడుతూ ప్రజా సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకుని ఆరు గ్యారంటీలను అమలు చేసే దిశగా ప్రజాపాలన కార్యక్రమం కొనసాగాలన్నారు. ప్రజాపాలన కార్యక్రమం గురించి జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. సమావేశంలో ఎస్‌పి రూపేష్, అదనపు కలెక్టర్, చంద్రశేఖర్, డిఆర్‌డిఒ శ్రీనివాసరావు, జడ్‌పి సిఇఒ ఎల్లయ్య, డిపిఒ సురేష్‌మోహన్, డిఆర్‌ఒ నగేష్, ఎఎస్‌పి అశోక్ ఆర్‌డిఒలు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడిఒలు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

హైదరాబాద్‌లో 30కి పైగా కరోనా కేసులు

- వైద్య, ఆరోగ్యశాఖ అప్రమత్తం
- అనుమానితులకు పరీక్షలు



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

వాక్సినేషన్ తర్వాత పూర్తిగా కనుమరుగైపోయిందని భావించిన కరోనా వైరస్ మళ్లీ కలకలం సృష్టిస్తోంది. దాదాపు ఏడాది తర్వాత వైద్య, ఆరోగ్య శాఖ కరోనా బులిటెన్ విడుదల చేసింది. దీంతో చిన్నారులు, గర్భిణులు, వృద్ధులు అప్రమత్తంగా ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. సోషల్ డిస్టెన్స్ పాటించడం, ఫేస్ మాస్కులు ధరించడం అనివార్యం కానుంది. ఈ నేపథ్యంలో హైదరాబాద్, మేడ్చల్ - మల్కాజిగిరి జిల్లాల వైద్య, ఆరోగ్యశాఖ అప్రమత్త మైంది. ఇప్పటికే సర్కార్ తోపాటు ప్రయివేటుఆస్పత్రులకు పలు సూచనలు చేసింది. కరోనా కట్టడికి తగిన చర్యలు తీసుకుంటోంది. రాష్ట్ర వ్యాప్తంగా నమోదవుతున్న కరోనా కేసుల్లో సగం హైదరాబాద్ జిల్లా నుంచే ఉంటున్నాయి. వారం రోజుల వ్యవధిలోనే జిల్లాలో దాదాపు 30కిపైగా కేసులు నమోదయ్యాయి.

ముందస్తు అప్రమత్తం

గాంధీ, ఉస్మానియా, ఫీవర్, చెస్ట్ ఆస్పత్రులతో మరో రెండు ప్రధాన ఆస్పత్రుల్లో కోవిడ్ నివారణకు ఏర్పాట్లు చేస్తున్నారు. మందులు, పిపిఇ కిట్లు, డిస్పోసబుల్ బెడ్ షీట్లు, మాస్కులు, శానిటైజర్లు అన్ని అందుబాటులో ఉండేలా చూస్తున్నారు. ఉద్యోగులు, వైద్యులు, సిబ్బంది భద్రత, శ్రేయస్సు దృష్ట్యా నిజాం వైద్య విధాన సంస్థ (నిమ్స్) ముందు జాగ్రత్త చర్యలు చేపట్టింది. ఆస్పత్రిలో మాస్క్ వినియోగం తప్పనిసరి చేస్తూ ఇప్పటికే ఉత్తర్వులు జారీ అయ్యాయి. కోవిడ్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో అఫ్జల్‌గంజ్‌లోని ఉస్మానియా జనరల్ ఆస్పత్రిలో ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. అన్ని రకాల సౌకర్యాలతో ఐసోలేషన్ వార్డును సిద్ధం చేశారు. తగినన్ని ఆర్‌టిపిసిఆర్ కిట్లు, మందులు అందుబాటులో ఉంచారు. నల్లకుంట ఫీవర్ ఆస్పత్రిలో నిర్వహిస్తున్న కొవిడ్ టెస్టుల్లో అనుమానిత కేసులు వస్తున్నాయి. సికింద్రాబాద్ గాంధీ కోవిడ్ ఐసోలేషన్ వార్డులో 50 ఆక్సిజన్, వెంటిలేటర్ పడకలను సిద్ధం చేశారు. నిలోఫర్ సహా ఇతర అన్ని ప్రభుత్వాస్పత్రుల్లో అనుమానితులకు వైద్య పరీక్షలు చేయడంతోపాటు ఇన్‌పేషెంట్ చికిత్స కోసం పడకలు సిద్ధం చేశారు. అవసరమైతే కొంత కాలంగా సర్వీసుకు దూరంగా ఉన్న టిమ్స్‌ను సైతం పునరుద్ధరించాలని త్వరలో నిర్ణయం తీసుకోనున్నట్టు సమాచారం.

2020లో హైదరాబాద్‌లో తొలి కేసు

ప్రపంచాన్ని గడగడలాడించిన కరోనా వైరస్ 2020 మార్చి 2వ తేదీన హైదరాబాద్ నగరంలో రెడ్ హిల్స్‌లో తొలి కోవిడ్ కేసుగా నమోదైంది. మొదటి వేవ్‌లో కోవిడ్ ఆల్ఫా వేరియంట్ విజృంభించగా, రెండో వేవ్‌లో డెల్టా వేరియంట్, మూడో వేవ్‌లో ఒమిక్రాన్ వేరియంట్ వెలుగు చూసింది. కొత్తగా ఒమిక్రాన్ జెఎన్-1 వేరియంట్ రూపంలో మళ్లీ విజృంభిస్తోంది. క్రమంగా వైరస్ తగ్గుముఖం పట్టిందనుకుని ఊపిరి పీల్చుకుంటున్న సమయంలో చాపకింద నీరులా మళ్లీ విస్తరిస్తోంది. దీంతో హైదరాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల వైద్య, ఆరోగ్యశాఖ అప్రమత్తమైంది. ఇప్పటికే జిల్లా, ఏరియా హాస్పిటల్స్‌తోపాటు బస్తీ దవాఖాన, పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీలను అప్రమత్తం చేసింది. కోవిడ్‌ను ఎదుర్కొనేందుకు సిద్ధంగా ఉండాలని ఇప్పటికే ఆదేశాలు సైతం జారీ అయ్యాయి. హైదరాబాద్ జిల్లాలో దాదాపు 120కి పైగా ప్రయివేటు ఆస్పత్రులకు మందస్తు సమాచారం ఇచ్చారు. కరోనా విజృంభిస్తే బెడ్లు, మందులు, వెంటిలేటర్లు, ఐసోలేషన్ వార్డులు, మందులను అందుబాటులో ఉంచుకోవాలని సూచనలు చేశారు. ఇప్పటికే ప్రభుత్వాస్పత్రుల్లో మాక్ డ్రిల్ నిర్వహించారు.

అప్రమత్తంగా ఉండాలి.. ఆందోళన అవసరం లేదు

డాక్టర్ రఘునాథస్వామి, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాకరోనా నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలి. కేసులు పెరుగుతున్న దృష్ట్యా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీప ప్రాథమిక, పట్టణ ఆరోగ్య కేంద్రం, బస్తీ దవాఖానలో పరీక్షలు చేయించుకోవాలి. ఇప్పటికే వైద్యులు, సిబ్బందిని అప్రమత్తం చేశాం. పూర్తి స్థాయిలో వైద్య బృందం అందుబాటులో ఉంటుంది. ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.

IN THE COURT OF THE HON'BLE JUNIOR CIVIL JUDGE-cum-V ADDITIONAL METROPOLITAN MAGISTRATE, MEDCHAL-MALKAJGIR DISTRICT, AT: MALKAJGIRI

O.S.NO. 483 of 2023

BETWEEN:
GADDAMIDI NIRMALA And others ... PLAINTIFFS
AND
THE THASILDAR, Medipally Mandal And others ... DEFENDANTS

To
D-2
ALL CONCERNED

NOTICE

The Plaintiffs had filed the above suit for Declaration to declare the Plaintiffs as Legal Heirs of the deceased Gaddamidi Narsing Rao, S/o Late G.Pochaiah in respect of Southern Part of Plot No.11, admeasuring 111 sq.yds or 92.795 sq.mts out of 222 sq.yds in Sy.Nos.109/1, 110 & 112, situated at Chengicherla Village and Grampanchayath, Ghatkesar Mandal, Medchal-Malkajgiri District and bounded on North: Northern Part of Plot No.11, South: 33 Wide Road, East: 25 Wide Road and West: Plot No.15. The Hon'ble Court was pleased to order for publication of this notice for your appearance in the above suit and the matter is posted to 28.12.2023 at 10.30 a.m. and therefore you may appear before this Hon'ble Court either personally or through your authorized counsel or otherwise the matter will be adjudicated in due process of Law. Hence, this Notice.

[BY ORDER OF THE COURT]

Sd/-
THUNGUNOORI BALRAJU,
Advocate
H.No.3-4-16-87/12, Street No.15,
Sri Rama Colony,
Ramanthapur, Uppal Mandal,
Medchal-Malkajgiri District.

నుమాయిష్‌కు రెడీ

- జనవరి 1 నుంచి ఫిబ్రవరి 15 వరకు నిర్వహణ
- దాదాపు 2,400 స్టాల్స్ ఏర్పాటు
- సిఎంతో ప్రారంభించేందుకు ఏర్పాట్లు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

హైదరాబాద్ నగరంలో అతిపెద్ద ఎగ్జిబిషన్ నుమాయిష్‌కు వేళైంది. నాంపల్లి ఎగ్జిబిషన్ సొసైటీ ఆధ్వర్యంలో 83వ అఖిల భారత పారిశ్రామిక వస్తు ప్రదర్శన (నుమాయిష్) వచ్చే ఏడాది జనవరి 1న ప్రారంభమై ఫిబ్రవరి 15 వరకు కొనసాగనుంది. 46రోజులపాటు ఈ ప్రదర్శన జరగనుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేతుల మీదుగా నుమాయిష్ ప్రదర్శనను ప్రారంభించేందుకు సొసైటీ ప్రతినిధులు ఏర్పాట్లు చేస్తున్నారు.

ఈసారి 2400 స్టాల్స్

గతేడాది నుమాయిష్‌లో దాదాపు 2300 స్టాళ్లను ఏర్పాటు చేయగా.. ఈసారి 2400 స్టాళ్లను ఏర్పాటు చేసేందుకు నిర్వాహకులు సిద్ధం చేశారు. ఇప్పటికే వివిధ రాష్ట్రాల నుంచి వ్యాపారులను ఆహ్వానించే ప్రక్రియను పూర్తి చేసిన సొసైటీ.. స్టాల్స్ నిర్మాణాన్ని ప్రారంభించింది. దాదాపు 85-90 శాతంపైగా పనులు పూర్తి కాగా మరికొన్ని నిర్మాణ పనులు జరుగుతున్నాయి. గత ఏడాదికి భిన్నంగా స్టాళ్లను ఏర్పాటు చేసేందుకు మైదానంలో లే-అవుట్ పనులు తీర్చిదిద్దుతున్నారు. ఎగ్జిబిషన్ ప్రవేశ ద్వారాల వద్ద పటిష్ట భద్రత ఏర్పాటు చేస్తున్నారు. ఎంట్రీ ఫీజు రూ.40గా నిర్ణయించారు. సందర్శకుల వాహనాల పార్కింగ్‌కు నగర ట్రాఫిక్ పోలీసులు, జీహెచ్ఎంసీ సహకారంతో ఖాళీ స్థలాన్ని ఉచితంగా కల్పిస్తున్నారు. నుమాయిష్ ద్వారా ప్రభుత్వానికి దాదాపు రూ.20 కోట్ల ఆదాయం సమకూరే అవకాశం ఉందని తెలుస్తోంది.

వృద్ధులు, నడవలేని వారికి ప్రత్యేక ఏర్పాట్లు

వృద్ధులు, నడవలేని వారి కోసం వాహనాల ద్వారా సందర్శన, అగ్ని ప్రమాదాలు జరగకుండా నివారణ చర్యలు చేపడుతున్నారు. వృద్ధులు, నడవలేని వారికి ఎగ్జిబిషన్ లోపల ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 3 వరకు వాహనాలతో సందర్శించే అవకాశం కల్పిస్తున్నారు. ఈసారి ఎగ్జిబిషన్‌లో ఫిష్ అక్వేరింగ్ ప్రత్యేకంగా ఏర్పాటు చేస్తున్నారు. 60 ఫీట్ల వెడల్పు, 40 ఫీట్ల ఎత్తులో ఈ అక్వేరింగ్ ఉంటుంది. ప్రస్తుతం దేశంలో, రాష్ట్రంలో మళ్లీ కరోనా కలకలం సృష్టిస్తున్న నేపథ్యంలో తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నట్టు సొసైటీ సభ్యులు చెబుతున్నారు. నుమాయిష్‌ను దృష్టిలో పెట్టుకుని టిఎస్ఆర్‌టిసి పలు డిపోల నుంచి ప్రత్యేకంగా బస్సులను నడపనుంది. నాంపల్లి, గాంధీ భవన్ మెట్రో స్టేషన్‌లు ఎగ్జిబిషన్ మైదానానికి సమీపంగా ఉంటాయి. మియాపూర్-ఎల్బీనగర్, నాగోల్, రాయదుర్గం మార్గాల్లో నడిచే మెట్రో రైళ్లను అర్ధరాత్రి 12 గంటల వరకు నడిపే అవకాశం ఉంది.

25లక్షలకుపైగా సందర్శన

ఈసారి నుమాయిష్‌ను 25 లక్షల మందికిపైగానే సందర్శించే అవకాశం ఉందని సొసైటీ సభ్యులు అంచనా వేస్తున్నారు. ఎగ్జిబిషన్ స్టాల్స్ ఏర్పాటు చేసే వ్యాపారులు ముందుగా దరఖాస్తు చేసుకుంటారు. ఈసారి 3500 దరఖాస్తులు వచ్చాయని సొసైటీ సభ్యులు తెలిపారు. ఇందులో సీనియార్టీని బట్టి స్టాల్స్ అప్పగించారు. ఫ్యాషన్, గార్మెంట్స్, టెక్స్‌టైల్స్, హ్యాండ్లూమ్స్, హోమ్ నీడ్స్, జ్యూవెల్లరీ, బ్యూటీ, హెల్త్ కేర్, ఎలక్ట్రానిక్ వస్తువులు, ఆటోమూవీస్, ఫుడ్ కోర్ట్‌తోపాటు తదితర వాటికి సంబంధించి స్టాల్స్ ఏర్పాటు కానున్నాయి. పిల్లల కోసం జాయ్‌రైడ్స్ అందుబాటులో ఉండనున్నాయి. వినియోగదారుల కోసం నుమాయిష్ మొబైల్ యాప్‌ను సైతం అందుబాటులోకి తీసుకొచ్చారు. తెలుగు, ఇంగ్లీషు, హిందీ, ఉర్దూ భాషల్లో స్మార్ట్ ఫోన్‌లలో యాప్ స్టోర్‌ల నుంచి డౌన్ లోడ్ చేసుకోవాలి. కాగా నాంపల్లి ఎగ్జిబిషన్ సొసైటీ అధ్యక్షులుగా ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డాక్టర్ దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఇటీవల బాధ్యతలు స్వీకరించిన విషయం తెలిసిందే.

ఏ రైతూ కరువు కోరుకోడు

- కెటిఆర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రైతులను ఉద్దేశించి కర్ణాటక మంత్రి శివానంద పాటిల్ చేసిన వ్యాఖ్యలను బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ తప్పుబట్టారు. తమ రుణాలను ప్రభుత్వం మాఫీ చేసేందుకు రైతులు ఏటా కరవును కోరుకుంటున్నారంటూ శివానంద పాటిల్ వివాదాస్పద వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. ఈ మేరకు సోమవారం ట్విటర్ (ఎక్స్) వేదికగా కెటిఆర్ స్పందించారు. రైతుల గురించి హాస్యాస్పద ప్రకటనలు చేస్తున్న వీరు.. ఏం మంత్రులని ప్రశ్నించారు. ఏ రైతు కూడా కరవు కోరుకోరని అన్నారు. అత్యంత దారుణమైన పరిస్థితుల్లోనూ రైతులు కోరుకునేది ప్రభుత్వం నుంచి సానుభూతి మాత్రమేనని కెటిఆర్ పేర్కొన్నారు.

కాంగ్రెస్ డిఎన్ఎలో హిందూ వ్యతిరేక ధోరణి

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాంగ్రెస్ డిఎన్ఎలోనే హిందూ వ్యతిరేక ధోరణి ఉందని బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ఆరోపించారు. ఇండియా కూటమిలోని డిఎంకె నేతలు హిందువులను కించపరిచేలా, సనాతన ధర్మాన్ని అవమానించేలా, హిందీ మాట్లాడే రాష్ట్రాలను గోమూత్ర రాష్ట్రాలని మాట్లాడుతున్నా రాహుల్‌గాంధీ ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. తెలంగాణ లో హామీల అమలుకు కాంగ్రెస్ ప్రభుత్వానికి మరికొంత సమయమిస్తామనీ, అప్పటికీ చేయకపోతే పోరాటం చేస్తామని తెలిపారు. సోమవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో కవిత మీడియాతో మాట్లాడారు. కొందరు నాయకులు విద్వేషపూరిత, దేశాన్ని విచ్ఛిన్నం చేసేలా వ్యాఖ్యలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వలస కార్మికులను అవమానిస్తున్నా పట్టదా? అని రాహుల్ గాంధీని ప్రశ్నించారు. దేశాన్ని ఐక్యం చేయడానికి కాదు.. తన సొంత ప్రచారం కోసమే ఆయన జోడో యాత్ర చేస్తున్నారని విమర్శించారు. వలస కార్మికులంటే ప్రగతిలో భాగస్వాములని బిఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి సిఎం కెసిఆర్ అన్నారనీ, కార్మికుల పట్ల తమ పార్టీకి అపారమైన గౌరవం ఉందని చెప్పారు.

లోక్‌సభ ఎన్నికలపై గురి

28న విస్తృతస్థాయి సమావేశం

అదే రోజు బిజెపిఎల్‌పి నేత ఎన్నిక!

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో గతం కంటే మెరుగైన సీట్లు...ఓట్ల శాతం సాధించిన బిజెపి లోక్‌సభ ఎన్నికల్లో వీలైనంత ఎక్కువ స్థానాలు సాధించడంపై దృష్టి సారించింది. తెలంగాణపై అమిత్‌షా ప్రత్యేక దృష్టి పెట్టి పనిచేస్తున్నట్టు తెలిసింది. లోక్‌సభ ఎన్నికలకు సమాయత్తం చేయడంలో భాగంగానే ఈ నెల 28న తెలంగాణకు ఆయన రాబోతున్నారు. ఈ నేపథ్యంలోనే విస్తృతస్థాయి సమావేశాన్ని నిర్వహించేందుకు రాష్ట్ర నాయకత్వం ఏర్పాట్లు చేస్తున్నది. ఆ సమావేశానికి తమ పార్టీ మండలాధ్యక్షులు, జిల్లా, రాష్ట్ర పదాధికారులు 1200 మందికిపైగా హాజరవుతారని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు జి.కిషన్‌రెడ్డి ప్రకటించారు. అమిత్‌షా ముఖ్యఅతిథిగా హాజరయ్యే ఆ సమావేశంలోనే బిజెపీ ఎల్పీ నేతను ఎన్నుకోనున్నట్టు సమాచారం.

విఆర్‌ఎల వెతలు వర్ణనాతీతం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

విఆర్ఒ, విఆర్ఎ వ్యవస్థను రద్దు చేసి ఏళ్లుగా వారిని ఆగం చేసిన గత సర్కారు సరిగ్గా ఎన్నికలకు ముందు ఇతర శాఖల్లోకి బదిలీ చేసింది. సూపర్ న్యూమరీ పోస్టులు సృష్టించి మరీ ఆగస్టు 10న జీవో నెంబర్ 81, 85 ద్వారా ప్రమోషన్ ఇచ్చినా ప్రభుత్వం గుర్తింపు నెంబర్ ఇవ్వలేదు. ఇంతలో ఎన్నికల కోడ్ రావడం కొత్తగా కాంగ్రెస్ సర్కారు కొలువుదీండం వంటి పరిణామాల మధ్య ఐదు నెలల కాలం గడిచింది. ఇచ్చిన ప్రమోషన్ ఉమ్మడి జిల్లా పరిధిలోగాకుండా ఇతర జిల్లాలో రావడం, అక్కడికి వెళ్లి కొలువులో చేరినా ఐదు నెలలుగా జీతాలు రాకపోవడంతో కుటుంబం గడవక అప్పులపాలవుతున్నారు. రాష్ట్రం ఏర్పడి అధికారంలోకి వచ్చిన బిఆర్ఎస్ సర్కారు తొలి రోజుల్లోనే విఆర్ఎల గౌరవవేతనాన్ని రూ.ఆరు వేల నుంచి రూ.10500కు పెంచింది. ఏళ్లుగా అదే కొలువులో ఉన్న వారికి ప్రమోషన్లు కల్పిస్తామని స్వయంగా గత సిఎం కెసిఆర్ 2016, 2020లో హామీలూ ఇచ్చారు. అయితే, రెవెన్యూశాఖను సమగ్ర ప్రక్షాళన చేసి భూవివాదాలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు 'ధరణి' పోర్టల్‌ను తీసుకొచ్చిన గత సర్కారు 2020లో కొత్త రెవెన్యూ చట్టాన్ని అమల్లోకి తెచ్చింది. భూ రికార్డుల విషయంలో విఆర్ఒ, విఆర్ఎల అవసరం లేదని ఆ పోస్టులను రద్దు చేసింది. విఆర్ఒలను ఇతర శాఖల్లోకి బదిలీ చేసింది. ఆ సమయంలో తమ కొలువుల సంగతి తేల్చాలని విఆర్ఎలు సుమారు మూన్నెళ్లపాటు ఆందోళన చేయగా, పంచాయతీరాజ్ మంత్రిగా ఉన్న కెటిఆర్ స్పందించి వీఆర్ఏల ప్రతినిధులతో చర్చించి పరిష్కారం చూపారు. ఇతర శాఖల్లో సూపర్ న్యూమరీ పోస్టులు సృష్టించి ఆగస్టు 10న జిఒ నెంబర్ 81, 85 ద్వారా పూర్వపు విఆర్ఎలకు ఉద్యోగోన్నతి కల్పించారు. కొందరిని రెవెన్యూలోనే ఉంచి, మిగిలిన వారిని ఎడ్యుకేషన్, వైద్యం, నీటిపారుదల, మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, మున్సిపల్, పంచాయతీరాజ్ వంటి శాఖల్లో వారి విద్యార్హతలు, వయసును బట్టి ఆఫీసు సబార్డినేటర్, రికార్డు అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్లుగా బదిలీ చేశారు.

ఐడీ నెంబర్ లేదు..

ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలో సుమారు 3200 మందికిపైగానే విఆర్ఎలు ఉండేవారు. జిల్లాల పునర్విభజనతో కొందరు ఉమ్మడి జిల్లా పరిధి దాటి ఇతర జిల్లాల్లోకి వెళ్లిపోయారు. కరీంనగర్ జిల్లాలో 565, సిరిసిల్లలోని 465, జగిత్యాలలో 470, పెద్దపల్లి జిల్లాలోని 460 మంది మిగిలిపోయారు. అయితే వీరందరికీ ప్రమోషన్ ఇచ్చి ఇతర శాఖల్లోకి బదిలీ చేసిన గత ప్రభుత్వం ఉమ్మడి జిల్లా పరిధి దాటి ఇతర జిల్లాలకు పంపించింది. అందులోనూ కరీంనగర్ జిల్లా వారికి నిర్మల్, హన్మకొండ, వరంగల్, సిరిసిల్ల జిల్లా వారికి కామారెడ్డి, నిజామాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాల్లో పోస్టింగ్‌లు ఇచ్చారు. కొందరికైతే భద్రాద్రి కొత్త గూడెంకూ వెళ్లాల్సి వచ్చింది. ప్రమోషన్ దూర జిల్లాల్లో వచ్చినా వెళ్లేందుకు సిద్ధమైన పూర్వపు విఆర్ఎలకు ప్రభుత్వం గుర్తింపు నెంబర్లు ఇవ్వలేదు. దీంతో ఐడి నెంబర్లు లేక జీతాలు రాని పరిస్థితి నెలకొంది.

రోడ్డును ఇరువైపులా సమానంగా విస్తరించాలి

- నోటీసులు ఇవ్వకుండా పనులు చేపట్టడంపై ఆగ్రహం
- చేర్యాల పట్టణ కేంద్రంలో అఖిలపక్షం రాస్తారోకో

పనులను అడ్డుకున్న నాయకులు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రోడ్డు విస్తరణ పనులను ఇరువైపులా సమానంగా చేయాలని డిమాండ్ చేస్తూ సిద్దిపేట జిల్లా చేర్యాల పట్టణ కేంద్రంలో జాతీయ రహదారిపై సోమవారం వ్యాపారులతో కలిసి అఖిలపక్ష నాయకులు రాస్తారోకో చేశారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు అందె అశోక్, బిజెపి జిల్లా కార్యదర్శి బూరు సురేష్ గౌడ్ మాట్లాడారు. పట్టణంలో కొనసాగుతున్న రోడ్డు విస్తరణ పనుల్లో తీవ్ర అన్యాయం జరుగుతోందన్నారు. పట్టణ పరిస్థితులను, బిల్డింగ్ యజమానుల అభ్యర్థనను పరిగణలోకి తీసుకోకుండా, నోటీసులు జారీ చేయకుండా రోడ్డు విస్తరణ పనులు చేయడం సరికాదన్నారు. ఎలాంటి నోటీసులూ జారీ చేయకుండా.. అధికారులు, మున్సిపల్ కమిషనర్, కాంట్రాక్టర్లు కుమ్మక్కై, ఇష్టారాజ్యంగా రోడ్డుకు ఒక పక్క 38 ఫీట్లు, మరోపక్క 46 ఫీట్లు మార్కింగ్ చేస్తూ తవ్వకాలు చేపడుతున్నారని ఆరోపించారు. వివిధ ప్రాంతాల నుంచి పట్టణానికి వచ్చి కాయకష్టం చేసి ఇండ్లు నిర్మించుకుని దుకాణ సముదాయాల్లో వ్యాపారాలు చేసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నారని చెప్పారు. రోడ్డు వెడల్పులో నిబంధనలు పాటించి ఇరువైపులా సమానంగా విస్తరణ పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో అఖిలపక్షం ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా కార్యదర్శి అందె బీరన్న, ఎంఎస్పీ ఉమ్మడి జిల్లా అధ్యక్షులు మల్లిగారి యాదగిరి, బిఎస్‌పి మండల అధ్యక్షులు బుట్టి బిక్షపతి, మాల మహానాడు రాష్ట్ర కార్యదర్శి బుట్టి సత్యనారాయణ, టిడిపి పట్టణ అధ్యక్షుడు మిట్టపల్లి నారాయణ రెడ్డి, నాయకులు పోతుగంటి రాందాస్, ఈరి భూమయ్య, ముస్త్యాల రాజేష్, రాళ్లబండి నాగరాజు, పోలోజు శ్రీహరి, జంగిలి యాదగిరి వైశ్య సంఘం అధ్యక్షులు నీల శివకుమార్, కిరాణా వర్తక సంఘం అధ్యక్షులు శేరి బాలనారాయణ, వైశ్య యువజన సంఘం అధ్యక్షులు ఐత సంపత్ కుమార్, మాజీ ఉపసర్పంచ్ మంచాల కొండయ్య పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

- ఎమ్మెల్సీ ఎవిఎన్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఉపాధ్యాయులు, విద్యారంగ సమస్యలను ఎప్పటికప్పుడు రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ ఏవీఎన్ రెడ్డి చెప్పారు. సోమవారం తపస్ రాష్ట్ర కార్యనిర్వాహకవర్గ సమావేశాన్ని హైదరాబాద్‌లో నిర్వహించారు. తపస్ డైరీ, క్యాలెండర్‌ను ఏవీఎన్ రెడ్డి, ఆర్ఎస్ఎస్ ప్రాంత కార్యవాహ కాచం రమేష్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ 317 జీవోకు సంబంధించి జిల్లాల వారీగా సూపర్ న్యూమరరీ పోస్టులను సృష్టించి వారికి న్యాయం జరిగేలా సిఎం దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. పాఠశాలలకు స్కావెంజర్లను నియమించేలా ప్రయత్నిస్తానని అన్నారు. రాష్ట్రంలో నూతన జాతీయ విద్యావిధానం-2020ని అమలు చేయాలని తీర్మానం చేశామని తపస్ అధ్యక్షులు హన్మంతరావు, ప్రధాన కార్యదర్శి నవాత్ సురేష్ చెప్పారు. ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తపస్ రాష్ట్ర సహాధ్యక్షులు పాపిరెడ్డి, అదనపు ప్రధాన కార్యదర్శి పెంటయ్య తదితరులు పాల్గొన్నారు.

కెటిపిపిలో డ్రైవర్ దుర్మరణం

- జెన్‌కో ముందు కుటుంబ సభ్యుల ధర్నా

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కాకతీయ థర్మల్ విద్యుత్ కేంద్రంలో బొగ్గు టిప్పర్ అన్‌లోడ్ చేస్తుండగా ప్రమాదవశాత్తు దాని కిందపడి డ్రైవర్ అక్కడికక్కడే మృతిచెందారు. వివరాలిలా ఉన్నాయి.. జయశంకర్-భూపాలపల్లి జిల్లా జంగేడు ఫకీర్‌గడ్డ గ్రామానికి చెందిన బుర్ర కొమురయ్య(38) ఆదివారం సాయంత్రం గణపురం మండలంలోని విద్యుత్ కేంద్రంలో టిప్పర్‌తో బొగ్గు లారీని లోపలికి తీసుకెళ్లాడు. ఈ క్రమంలో బొగ్గును అన్‌లోడ్ చేస్తుండగా జాకీ విరిగి ఆయన మీద పడటంతో అక్కడికక్కడే మృతిచెందాడు. దీన్ని ఎవరూ గమనించలేదు. సోమవారం కుటుంబ సభ్యులు కొమురయ్య కోసం వెతకగా మృతదేహం కనిపించింది. దాంతో వారు జెన్‌కో గేటు ముందు మృతదేహంతో ధర్నా చేశారు. ఎస్ఐ సాంబమూర్తి సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. మృతదేహాన్ని భూపాలపల్లి ఆస్పత్రికి తరలించారు. ఆయనకు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

లోక్‌సభ ఎన్నికలపై గురి

28న విస్తృతస్థాయి సమావేశం

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ లోక్‌సభ ఎన్నికల్లో వీలైనంత ఎక్కువ స్థానాలు సాధించడంపై దృష్టి సారించింది. దీనిలో భాగంగా అమిత్ షా ఈ నెల 28న తెలంగాణకు రాబోతున్నారు. ఈ నేపథ్యంలో విస్తృత స్థాయి సమావేశం నిర్వహణకు ఆ పార్టీ రాష్ట్ర నాయకత్వం ఏర్పాట్లు చేస్తోంది. ఆ సమావేశానికి తమ పార్టీ మండలాధ్యక్షులు, జిల్లా, రాష్ట్ర పదాధికారులు 1200 మందికిపైగా హాజరవుతారని బిజెపి రాష్ట్ర అధ్యక్షులు జి.కిషన్‌రెడ్డి ప్రకటించారు. లోక్‌సభ ఎన్నికల ముందు జరుగుతున్న ఆ సమావేశాలను రాజకీయంగా తమకు అనుకూలంగా మలుచుకోవడంపై కమలం పార్టీ పెట్టింది. అమిత్ షా ముఖ్యఅతిథిగా హాజరయ్యే ఆ సమావేశంలోనే బిజెపి ఎల్పీ నేతను ఎన్నుకోనున్నట్టు సమాచారం

గురుకుల ఉపాధ్యాయుల బదిలీలు చేపట్టాలి

- టిఎస్‌యుటిఎఫ్ గురుకులం రాష్ట్ర కమిటీ డిమాండ్
- నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గిరిజన గురుకుల సంక్షేమ ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులను వెంటనే చేపట్టాలని టిఎస్‌యుటిఎఫ్ గురుకులం రాష్ట్ర కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. టిఎస్‌యుటిఎఫ్ గిరిజన సంక్షేమ గురుకుల విద్యాసంస్థల సొసైటీ (గురుకులం) ఉపాధ్యాయుల విభాగం రాష్ట్ర కమిటీ సమావేశాన్ని సోమవారం హైదరాబాద్‌లోని టిఎస్‌యుటిఎఫ్ రాష్ట్ర కార్యాలయంలో హరీందర్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. టిఎస్‌యుటిఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చావ రవి, కోశాధికారి టి లక్ష్మారెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా రవి మాట్లాడుతూ రాష్ట్రంలో 160 గురుకులాలు, 23 ఏకలవ్య ఆదర్శ గురుకులాలను గురుకులం సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారని వివరించారు. ఈ విద్యాసంస్థల్లో 2018, 2019లో నియామకమైన ఉపాధ్యాయులకు ఆరేండ్లైనా రెగ్యులరైజేషన్ ఉత్తర్వులు విడుదల చేయలేదని చెప్పారు. దీంతోపాటు బదిలీలు, పదోన్నతులు నిర్వహించకపోవటం శోచనీయమన్నారు. ఉపాధ్యాయులపై బోధనేతర పనుల భారాన్ని తగ్గించాలని కోరారు. శ్రమకు తగిన వేతనాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. లక్ష్మారెడ్డి మాట్లాడుతూ...జిఒ 317, పిఆర్‌సిలో కరస్పాండింగ్ స్కేలు వర్తింపు, 2008లో రెగ్యులరైజ్ అయిన ఉపాధ్యాయులకు పాత పెన్షన్ వర్తింపు వంటి అంశాలపై హైకోర్టు తీర్పులను తక్షణమే అమలు చేయాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు ఎ గణేష్, బి ఈశ్వర్, ఎస్ ఉపేందర్, డి వెంకన్న, ఎం పావని, కె నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా సురేందర్, హరీందర్‌రెడ్డి

సమావేశానంతరం టిఎస్‌యుటిఎఫ్‌నకు అనుబంధంగా గురుకులం ఉపాధ్యాయుల విభాగం రాష్ట్ర కమిటీని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షులుగా డాక్టర్ బి సురేందర్, ప్రధాన కార్యదర్శిగా వి హరీందర్‌రెడ్డి, కోశాధికారిగా ఎస్ రవి కుమార్, మరో 15 మంది కార్యవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ప్రతులను దగ్ధం చేస్తున్న నాయకులు

మనుస్మృతి నిండా ద్వేషమే

- రాజ్యాంగ రక్షణకోసం ఉద్యమాలు
- మనుస్మృతి ప్రతుల దహన కార్యక్రమంలో స్కైలాబ్‌బాబు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

మనుస్మృతి నిండా ద్వేషభావమే నిండి ఉందని కెవిపిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి స్కైలాబ్‌బాబు తెలిపారు. మనుషుల మధ్య ద్వేషాన్ని నింపి, వైషమ్యాలు సృష్టంచటమే దాని పనని ఆయన విమర్శించారు. సోమవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రం వద్ద కెవిపిఎస్ ఆధ్వర్యంలో మనుస్మృతి ప్రతులను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా స్కైలాబ్ మాట్లాడుతూ.. ఆర్ఎస్ఎస్ రిమోట్ కంట్రోల్‌తో పనిచేస్తున్న కేంద్ర బిజెపి సర్కార్ రాజ్యాంగం రద్దుకు కుట్రలు చేస్తున్నదని విమర్శించారు. సామాజిక అసమానతలకు, వివక్షతలకు మను 'అధర్మ' శాస్త్రమే మూలమని తెలిపారు. దీన్ని నిషేధించాల్సిన అవసరముందన్నారు. నూటికి 90శాతం మందికి అది చదువును, సంపదలను దూరం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. మనువాదానికి పాతరేస్తేనే సమాజ అభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. బ్రాహ్మణాధిపత్యాన్ని కాపాడటానికి, దోపిడీ వ్యవస్థ రక్షణ కోసం పుట్టిందే మనువాదమని చెప్పారు. కార్యక్రమంలో డివైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్ , కెవిపిఎస్ నాయకులు ఎన్ బాలపీరు తదితరులు పాల్గొన్నారు.

చెరువులోకి దూసుకెళ్లిన కారు

- సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ మృతి
- వికారాబాద్ జిల్లాలో ఘటన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పొగమంచు అలుముకుని దారి కనిపించక కారు చెరువులోకి దూసుకెళ్లింది.. దీంతో కారులో ఉన్న వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన వికారాబాద్ జిల్లా వికారాబాద్ మున్సిపల్ పరిధిలో సోమవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..

వికారాబాద్‌లోని అనంతగిరి హిల్స్ చూసేందుకు హైదరాబాద్ మాదాపూర్ నుంచి సోమవారం తెల్లవారుజామున మూడు గంటల సమయంలో కారులో ఐదుగురు స్నేహితులు బయలుదేరారు. రఘు, మోహన్, సాగర్, గుణశేఖర్ (24)తో పాటు పూజిత కారులో ఉన్నారు. శివారెడ్డిపేట దగ్గరికి రాగానే పొగమంచుతో రోడ్డు కనబడకపోవడంతో కారు చెరువులోకి దూసుకెళ్లింది. అందులో రఘుకి ఈత రావడంతో సాగర్, మోహన్, పూజితను రక్షించాడు. గుణశేఖర్ కారుతోపాటు మునిగిపోయాడు. వెంటనే స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు ఘటనా స్థలానికి వచ్చి రెస్క్యూ చేపట్టారు. ముందుగా కారును బయటకు తీశారు. అనంతరం గుణశేఖర్ మృతదేహం లభ్యమైంది. కారుకి ఇరువైపులా డ్యామేజ్‌లు ఉండటంతో వేరే ఏదైనా వాహనాన్ని ఢీకొట్టారా అనే విషయం తెలియాల్సి ఉంది. పూజిత ఇటీవల అమెరికా నుంచి వచ్చింది. వీరంతా సాఫ్‌వేర్ ఉద్యోగాలతో పాటు బిజినెస్‌లు చేస్తున్నారు. అయితే బస్సు తమ కారును ఢీకొట్టడంతో పొగమంచులో కనిపించక చెరువులోకి దూసుకెళ్లినట్టు పూజిత తెలిపింది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'మల్కాజిగిరి' గెలవాల్సిందే..!

- ప్రధాన పార్టీల్లో మొదలైన కసరత్తు
- అసెంబ్లీ ఎన్నికలపై లోతైన విశ్లేషణ
- ఎంపి అభ్యర్థుల ఎంపికపైనా కసరత్తు
- వ్యూహాలకు పదును పెడుతున్న కాంగ్రెస్, బిజెపి, బిఆర్ఎస్ పార్టీలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పార్లమెంట్ ఎన్నికల కోసం ప్రధాన రాజకీయ పార్టీలు వ్యూహాలకు పదును పెడుతున్నాయి. పార్లమెంట్ ఎన్నికల్లో ఎలాగైనా గెలవాలన్న పట్టుదలతో ఉన్నాయి. రాష్ట్రంలో అధికారం చేపట్టిన కాంగ్రెస్.. ఎంపి ఎన్నికల్లోనూ పై చేయి సాధించేందుకు ఇటీవల ఇన్‌చార్జీలనూ నియమించింది. రాష్ట్రంలో అధికారం కోల్పోయినా ఈ నియోజవర్గాల్లోని అసెంబ్లీ స్థానాల్లో విజయం సాధించిన బిఆర్ఎస్ మరింత ఓటు శాతం పెంచుకోవడంపై దృష్టి పెట్టింది. మరోవైపు బిజెపి బలం పెంచుకునేందుకు ప్రయత్నం చేస్తున్నది.

ఎవరి ధీమా వారిదే

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలో మల్కాజిగిరి ఒక్కటే పార్లమెంట్ స్థానం ఉంది. ఇక్కడి నుంచి గెలుపొందిన రేవంత్‌రెడ్డి సిఎం కావడంతో లోక్‌సభ స్థానానికి రాజీనామా చేశారు. దీనికి తోడు పార్లమెంట్ ఎన్నికలు కూడా దగ్గరపడటంతో ఈ స్థానంపై కాంగ్రెస్, బిజెపి, బిఆర్ఎస్ పార్టీలు ఎవరికి వారు గెలుపు వ్యూహాలకు పదును పెడుతూ అభ్యర్థులను బరిలో దింపే యోచనలో ఉన్నాయి. విజయోత్సాహంలో ఉన్న కాంగ్రెస్ మరింత దూకుడు పెంచి అభ్యర్థుల ఎంపికపై కసరత్తు చేస్తోంది. మల్కాజిగిరి ఎంపీగా, టిపిసిసి అధ్యక్షునిగా రాష్ట్ర వ్యాప్తంగా విస్తృతంగా ప్రచారం చేసి పార్టీని అధికారంలోకి తీసుకొచ్చి సిఎం అయిన రేవంత్‌రెడ్డి తన సిట్టింగ్ స్థానంపై ఫోకస్ పెట్టినట్టు పార్టీలు వర్గాలు చెబుతున్నాయి. ఈ పార్లమెంట్ పరిధిలోకి మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాలోని ఐదు అసెంబ్లీ నియోజకవర్గాలతోపాటు రంగారెడ్డి జిల్లాలోని ఎల్బీనగర్ నియోజకవర్గమూ వస్తుంది. ఈ ఆరు నియోజకవర్గాల్లోనూ ప్రస్తుత ఎన్నికల్లో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలే విజయం సాధించారు. 2018లో ఎల్బీనగర్‌లో కాంగ్రెస్ గెలుపొందగా.. మిగిలిన ఐదు నియోజవర్గాల్లోనూ బీఆర్ఎస్ గెలిచింది. కానీ

ఇక్కడి నుంచి ఎంపీగా కాంగ్రెస్ తరుపున రేవంత్‌రెడ్డి గెలుపొందారు. ఈ పార్లమెంట్ సెగ్మెంట్‌లో ప్రస్తుతం కాంగ్రెస్ కంటే బీఆర్ఎస్ ఎక్కువగా బలంగా ఉన్నట్టు కనిపిస్తోంది. అయితే ఎవరికి వారుగా ఈసారి గట్టిగానే కృషి చేయాలనే పట్టుదలతో మూడు పార్టీలూ ఉన్నాయి. గత లోక్‌సభ ఎన్నికల్లో ఈ స్థానంలో ఆశించింత మేర ఓట్లు సాధించలేకపోయిన బిజెపి ఈసారి 'మల్కాజిగిరి' పార్లమెంట్ సెగ్మెంట్‌పై సీరియస్‌గానే ఆలోచిస్తుంది.

అసెంబ్లీ ఫలితాలు బేరీజు

ఈ పార్లమెంట్ స్థానంలో ఆరు అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. ఈ ఆరింటిలోనూ ప్రస్తుతం బిఆర్ఎస్ ఎమ్మెల్యేలే ఉన్నారు. ఎల్బీనగర్, కుత్బుల్లాపూర్ నియోజవర్గాల్లో బీజేపీ రెండో స్థానంలో ఉండగా, మేడ్చల్, మల్కాజిగిరి, ఉప్పల్, కూకట్‌పల్లి నియోజవర్గాల్లో కాంగ్రెస్ రెండో స్థానంలో ఉంది. అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు అనుకూలంగా రావడంతో బిఆర్ఎస్ పై చేయి ప్రదర్శిస్తుండగా.. రాష్ట్రంలో అధికారం చేపట్టడంతోపాటు 'మల్కాజిగిరి' పార్లమెంట్ సిట్టింగ్ కావడంతో కాంగ్రెస్ సైతం దూకుడుగానే కనిపిస్తుంది. ఈ స్థానానికి ఇన్‌చార్జిగా మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును కాంగ్రెస్ అధిష్టానం నియమించింది. అసెంబ్లీ ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపిక ఆలస్యం కావడంతోనే ఓడిపోవాల్సి వచ్చిందని విశ్లేషించుకున్న బిజెపి, కాంగ్రెస్ పార్టీలు ఈ సారి ముందుగానే అభ్యర్థులను ప్రకటించాలనే ఆలోచనకు వచ్చినట్టు సమాచారం.

తెరపైకి పలువురి పేర్లు

మల్కాజిగిరి పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేసేందుకు పలువురు ఆసక్తి కనబరుస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓడిపోయిన వారితోపాటు కొత్త వారు సైతం పోటీలో ఉండేందుకు ముందుకొస్తున్నారు. బిజెపి నుంచి ఆ పార్టీ జాతీయ కార్యదర్శి మురళీధర్‌రావు, మాజీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌తోపాటు మరికొందరు ఆసక్తి కనబరుస్తున్నారు. ఇక కాంగ్రెస్ నుంచి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి పేరు ప్రధానంగా వినిపిస్తుంది. ఇన్‌చార్జి మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు కాంగ్రెస్ నేతలతో నిర్వహించిన సమావేశంలో ఎల్బీనగర్ నుంచి పోటీ చేసి ఓడిపోయిన మధుయాష్కీగౌడ్ కనిపించడంతో ఆయన కూడా ఈ స్థానం నుంచి పోటీ చేసేందుకు సుముఖంగా ఉన్నట్టు వార్తలు వస్తున్నాయి. ఇక బీఆర్ఎస్ నుంచి గత పార్లమెంట్ ఎన్నికల్లో పోటీ చేసి ఓడిపోయిన మర్రి రాజశేఖర్‌రెడ్డి మల్కాజిగిరి ఎమ్మెల్యేగా గెలుపొందడంతో ఆ పార్టీ నుంచి ఎవరు బరిలో ఉంటారనేది ఆసక్తిగా మారింది.